సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 9 : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి హెచ్చరించారు. కలెక్టర్ అధ్యక్షతన మల్టీ మెంబర్ కమిటీ పీసీపీఎన్‌డీటీ చట్టంపై జిల్లా ఎస్పీ రూపేశ్‌తో కలిసి మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. కొత్తగా 11 సెంటర్ల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు, 13 సెంటర్లు రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసినట్లు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గాయత్రీ దేవి ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 125 స్కానింగ్ సెంటర్స్‌కు అనుమతి ఉన్నదని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎవరైనా లింగనిర్ధారణ తెలియజేస్తే అందుకు 3 ఏండ్ల నుంచి 5 ఏండ్ల వరకు జైలు శిక్ష, రూ. లక్ష వరకు జరిమానా విధించనున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీల చేతుల మీదుగా పీసీపీఎన్‌డీటీ స్టిక్కర్స్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి వనజారెడ్డి, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి, డాక్టర్ నాగనిర్మల, డాక్టర్ మనోహర్‌రెడ్డి, ప్రసాద్ వీరకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 కోట్లకు పైగా మొక్కలు నాటే లక్ష్యం ఉన్నదని తెలిపారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. రైతు భరోసా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. టీచర్ల బదిలీలు విజయవంతంగా జరిపిన విధంగా ఉద్యోగుల బదిలీలు నిబంధనలను పాటిస్తూ ఈ నెల 20లోగా ముగించాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజారాణి, డీఆర్డీవో జ్యోతి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 9: జిల్లాలో మాతృ, శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాతృ, శిశు మరణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 2023-24 సంవత్సరానికి 27 కేసులు నమోదయ్యాయని తెలిపారు. హై రిస్క్ కేసులు డెలివరీ అయ్యే వరకు సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీ దేవి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కాలుష్య సమస్యను పరిష్కరించాలని వినతి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

జిన్నారం, జులై 9 : ఖాజీపల్లి గ్రామంతో పాటు మరో నాలుగు గ్రామాలను కాలుష్యం నుంచి కాపాడి ప్రజల ఆరోగ్యాలను రక్షించాలని కాలుష్య నియంత్రణ పోరాట సమితి జేఏసీ నాయకులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జేఏసీ చైర్మన్ ప్రముఖ న్యాయవాది, పర్యావరణవేత్త దండే రమాకాంత్ ఆధ్వర్యంలో జేఏసీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గత నలభై ఏండ్ల క్రితం ఖాజీపల్లి, గడ్డపోతారం గ్రామాలు పచ్చదనంతో కళకళలాడాయని, చెరువు, బావుల్లో నీళ్లు తాగే వాళ్లమని ఇప్పుడు నీటి వనరులు, భూమి పూర్తిగా కాలుష్యం బారిన పడి వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయని చెప్పారు. కాలుష్య సమస్యను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. కుమార్ యాదవ్, మహేశ్, సురేశ్, కిరణ్, సభ్యులు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు

జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోహీర్, జూలై 9 : జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలో కేక్‌కట్ చేశారు. అనంతరం పట్టణంలోని ఏరియా దవాఖానలో ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తట్టునారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్ప, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ అల్లాడి నర్సింహులు, వెంకటేశం, యాకూబ్, మశ్చేందర్, బండిమోహన్, రాకేశ్, సంజీవ్ పవార్, హీరు రాథోడ్, భీమ్‌రావు రాథోడ్, నరేశ్, శివాజీ రాథోడ్, ప్రేమ్‌సింగ్, మోహన్ రాథోడ్, సికిందర్ రాథోడ్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్, జూలై 9 : మండలంలోని గ్రామాల్లో మంగళవారం జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మల్లి గ్రామంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మారుతీ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సిద్ధారెడ్డి, శ్రీపాతి, అఖిల్‌మియా, బస్వరాజ్, మారుతి, వెంకట్, సంతోశ్ రెడ్డి, మహేశ్, నగేశ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుపై రైతులకు అవగాహన

కోహీర్, జూలై 9 : మల్బరీ సాగు రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తున్నదని వికారాబాద్ పట్టు పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్ మండలంలోని మల్చెల్మ గ్రామంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్బరీ సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని వారు సూచించారు. పట్టు పురుగుల పెంపకం షెడ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు సాయం అందిస్తుందన్నారు. సాగుతో రైతులకు లాభాలు వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర, ముణిరత్నంరెడ్డి, డాక్టర్ విజయ్ కుమార్, శ్రీనివాస్ రావు, పండు రంగారెడ్డి, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు లేక అవస్థలు..

రామచంద్రాపురం, జూలై 9 : తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్‌కు సరైన రోడ్డు లేక నానా అవస్థలు పడుతున్నామని తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరీగారి రమణ తెలిపారు. మంగళవారం తహసీల్‌లో టీనా సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ విశ్వేశ్వర్‌ని కలిసి రోడ్డు సమస్యను వివరించి వినతి పత్రం అందజేశారు. వర్షాకాలంలో అయితే రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉంటుందని, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి రోడ్డుని సర్వే చేసి మున్సిపల్ రికార్డ్స్ ప్రకారం రోడ్డుని గుర్తించాలని కోరారు.

వర్షాలతో పూర్తిగా గుంతలు, బురదమయంగా మారిన రోడ్డు

చట్నీ పాత్రలో ఎలుక

బాలికల హాస్టల్‌లో వంట దినుసులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో పాండు

- సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో ఘటన.. వైరల్‌గా మారిన వీడియో
- తరగతి గదులు బహిష్కరించి విద్యార్థుల ఆందోళన
- కళాశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ మాధురి
- కేర్ టేకర్ల తొలిగింపునకు ఆదేశాలు
- నాణ్యమైన ఆహారం అందడం లేదంటూ విద్యార్థుల గగ్గోలు

చౌటకూర్, జూలై 9: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాల మరోసారి వార్తల్లోకెక్కింది.బాలుర హాస్టల్‌లోని మెస్‌లో ఉన్న పల్లి చట్నీ పాత్రలో ఎలుక చక్కర్లు కొట్టడం చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ అధికారుల బృందంతో పాటు జిల్లా అధికారులు రంగప్రవేశం చేశారు. సోమవారం సాయంత్రం పల్లీ చట్నీ పాత్రలో ఎలుక సంచరించడాన్ని అక్కడున్నవారు వీడియో తీశారు. మంగళవారం ఉదయమే ఈ వీడియోను పలు గ్రూపుల్లోకి షేర్ చేశారు. దీంతో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి హుటాహుటినా కళాశాలకు వచ్చి విచారణ చేపట్టారు. జరిగిన సంఘటన విషయమై విద్యార్థినీ, విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడారు. కొంతకాలంగా తమకు నాణ్యతలేని ఆహారాన్ని వడ్డిస్తున్నారని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కారం కావడం లేదని విద్యార్థులు ఆరోపించారు. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ విభాగాలకు సంబంధించి సుమారు 1400 మంది విద్యార్థినీ, విద్యార్థులు వేర్వేరుగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. అమ్మాయిలు, అబ్బాయిలతోనూ అడిషనల్ కలెక్టర్ మాధురి మాట్లాడారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, సీఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారుల బృందం కళాశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించింది. జరిగిన తప్పిదాలపై విచారణ చేపట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెస్ కాంట్రాక్టర్‌ను తొలిగిస్తున్నట్లు అక్కడే ప్రకటించారు. విద్యార్థులతో కళాశాలలో ప్రత్యేకంగా అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తమకు అధ్వానమైన భోజనాన్ని అందిస్తున్నారంటూ జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఒక్కోసారి భోజనం సరిగ్గా లేకపోవడంతో పస్తులు ఉంటున్నామని, బయట నుంచి పార్సిల్ తెప్పించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మెస్‌లు శుభ్రంగా లేనందున ఎలుకలు, బల్లులు, ఈగలు సంచరిస్తున్నాయని గగ్గోలు పెట్టారు. ఇందుకు కారణమైన ఆరుగురు కేర్‌టేకర్లకు మెమోలు ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాల్ నరసింహను ఆదేశించారు. ఈ సంఘటన నేపథ్యంలో విద్యార్థులు తరగతులను బహిష్కరించి కళాశాల పరిపాలన భవనం ఎదుట బైఠాయించి, ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ స్పందించారు. సోమవారం ఉదయం వేళ విద్యార్థినీ, విద్యార్థులకు వడ టిఫిన్ అందజేశామని, అయితే, పాత్రలను శుభ్రం చేసే ప్రదేశంలో రాత్రి ఎలుక వంట పాత్రలోని చట్నీలో పడిందని ఆయన వివరించారు. బాలికలు, బాలుర వసతి గృహాలకు భోజనం సరఫరా చేస్తున్న మెస్ కాంట్రాక్టర్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తున్నారని, అనుకోకుండా ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు.

మెస్ కాంట్రాక్టర్‌పై అడిషనల్ కలెక్టర్ ఆగ్రహం

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో వంట పాత్రలోని చట్నీలో ఎలుక పడిందన్న విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఈ సంఘటనపై విచారణ జరుపాలంటూ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురిని ఆదేశించారు. దీంతో ఆమె హుటాహుటినా కళాశాలకు చేరుకుని హాస్టల్‌లోని మెస్‌లను తనిఖీ చేశారు. తాము విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు ఆమెతో ఏకరువు పెట్టారు. భోజనం సరిగ్గా పెట్టడంలేదంటూ పరిశుభ్రత లోపించిందని తదితర అంశాలపై ఆమెకు ఫిర్యాదు చేశారు.ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ పాల స్టోర్ రూంలో నిల్వ ఉన్న కూరగాయలు, వంటల్లో ఉపయోగించే మసాలలను పరిశీలించారు. అల్లం డబ్బాలోంచి తీవ్ర దుర్గంధం రావడంతో అక్కడే ఉన్న వంట మనుషులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఇలాగే వండుకుని తింటారా అని ప్రశ్నించారు.

జేఎన్‌టీయూ ఘటనపై మంత్రి దామోదర రాజనరసింహ ఆరా..

సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాల బాలుర హాస్టల్‌లో జరిగిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆరాతీశారు. విద్యార్థులు టిఫిన్‌లో తినే చట్నీలో ఎలుక పడిందంటూ తీసిన వీడియో వైరల్ కావడంతో పాటు పలు టీవీ చానళ్లలో ప్రసారం కావడంతో స్పందించిన మంత్రి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

అపరిశుభ్రంగా ఉన్న వంట గది

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇలాంటి ఘటనలు

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

చౌటకూర్, జూలై 9: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. అన్నంలో పురుగులు, చట్నీలో ఎలుకలు రావడం వంటి ఘటనలు జేఎన్‌టీయూలో సర్వసాధారణమైపోయాయని అన్నారు. మంగళవారం ఈ మేరకు ఓ వీడియో సందేశాన్ని పంపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కళాశాలలోల మెరుగైన, నాణ్యతమైన భోజనాన్ని అందజేశామని గుర్తు చేశారు. సాక్షాత్తు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలల్లోని వసతి గృహాలు అధ్వాన్నంగా తయారయ్యాయని ధ్వజమెత్తారు. వసతి గృహాల్లో నాణ్యతమైన భోజనాన్ని అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రోబోటిక్స్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ

రామచంద్రాపురం, జూలై 9 : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో ఉన్న టీఎస్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు రోబోటిక్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సోహన్ అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ అనే సంస్థ రోబోటిక్స్ కోర్సులో విద్యార్థులకు ఉచిత శిక్షణను ఇస్తుందన్నారు. ఈ సంస్థ సంగారెడ్డి జిల్లాలో పది పాఠశాలలను ఎంపిక చేసుకోగా, అందులో వెలిమెల టీఎస్ మోడల్ స్కూల్ ఒకటని తెలిపారు. అకాడమీ వ్యవస్థాపకుడు కె.సహదేవ్, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, టీమ్ లీడ్ రాహుల్, ఇన్‌చార్జిలు జోషి ప్రసూన, రామాంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు పదవితో సంబంధం లేదు..

సన్మాన గ్రహీతలతో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం, జూలై 9 : ప్రజా సేవకు పదవితో సంబంధం లేదని, ప్రజల కష్టాల్లో అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ అన్నారు. కొడకంచి- శివనగర్ గ్రామాల మాజీ ఎంపీటీసీ బత్తుల సంతోషమహేశ్ మంగళవారం శివనగర్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకుడు అనే వ్యక్తి పదవి ఉన్న లేకపోయినా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ బత్తుల సంతోషమహేశ్ మాజీ వైస్ ఎంపీపీ గంగురమేశ్, సోలక్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, గడ్డపోతారం మాజీ ఎంపీటీసీ జనాబాయి, గ్రామంలోని మాజీ వార్డు సభ్యులు, నాయకులు, శివనగర్, కొడకంచి గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

హనుమాన్ మందిరానికి విరాళం

ఆలయానికి విరాళం అందజేస్తున్న మండల బీఆర్ఎస్ కార్యాదర్శి శంకర్

రాయికోడ్, జూలై 9 : మండల కేంద్రమైన రాయికోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమంతుడి ఆలయానికి మంగళవారం రాయికోడ్ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి శంకర్ తన వంతుగా రూ. 21 వేలు విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవించాలన్నారు. ఆధ్యాత్మిక సేవలో తను ఎల్లప్పుడు ముందుంటాన్నారు. ఆధ్యాత్మిక ఉంటేనే ప్రజలు అందరూ ప్రశాంతంగా ఉంటారన్నారు. మండలంలో ఎవరైనా మందిరాలు, మసీదులు, చర్చిలు నిర్మాణం చేపడితే తన వంతుగా సాయ మందిస్తామన్నారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు రవి, అంజన్న, శివ కుమార్ స్వామి, ముత్యాల శివ ఉన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

గుమ్మడిదల, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భారతీయ కిసాన్ మోర్చా నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం మండల తహసీల్‌లో తహసీల్దార్ గంగాభవానీకి భారతీయ కిసాన్ మోర్చ మండలాధ్యక్షుడు పోచుగారి రవీందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జిన్నారంలో..

జిన్నారం, జూలై 9 : ఎన్నికల సమయంలో ప్రజలకు, రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు భవానీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునస్వామికి వినితి పత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి, బొల్లారం మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి, నాయకులు రమేశ్, రాజు, సుధాకర్, వీరేశ్, నవీన్, రాజ భార్గవ, మహేశ్, అశోక్, లక్ష్మణ్, స్వామి, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్,జూలై 9 : కాంగ్రెస్ ఎలక్షన్ కంటే ముందు ఇచ్చిన హామిలను అమాలు చేయడం లేదాని బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు పెద్దగొల్ల తుకారంకురుమ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్ తహసీల్‌లో వినతి పత్రం అందజేశారు. రైతులకు రైతు భరోసా, రుణమాఫీ వెంటనే అమలు చేయాలన్నారు. నాయకుల గణేష్, మాణిక్‌లు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

అక్రమ మోరం పనులను పరిశీలించిన మునిపల్లి తహసీల్దార్

మునిపల్లి : బుధేరా మైనింగ్ నిర్వహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ తెన్‌మోళి

మునిపల్లి, జూలై 9 : మండలంలో 'దర్జాగా మొరం అక్రమదందా' అనే శీర్షిక సోమవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మునిపల్లి తహసీల్దార్ తెన్‌మోళీ స్పందించి సోమవారం రాత్రి సమయంలో మునిపల్లి ఆర్ఐ రవీందర్‌తో మునిపల్లి మండలంలో ఎక్కడ ఎక్కడ అక్రమ మొరం తవ్వకాలు జరిపిస్తున్నారో తనిఖీలు చేయించారు. మంగళవారం మునిపల్లి మండలంలోని బుధేరా,కంకోల్,లింగంపల్లి, మగ్దుంపల్లి,పెద్దగోపులారం గ్రామ శివారుల్లో అక్రమర్కులు చేపడుతున్న అక్రమ మొరం దందా స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మునిపల్లి తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే ఎంతటివారైనా సరే కేసులు నమోదు చేసి సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామన్నారు. బుధేరా గ్రామ శివారులో జరుగుతున్న మైనింగ్ పనులకు సంబంధించి పలు రికార్డులు తనిఖీ చేసినట్లు తెలిపారు. మైనింగ్ పనులకు సంబంధించి పూర్తి వివరాలు సూచించాలన్నారు. అధికారుల అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేయ్యరాదన్నారు. అధికారుల అదేశాలు లెక్కచెయ్యకుండా అక్రమ మొరం తవ్వకాలు చేసినట్లు తెలిస్తే వాహనాన్ని సీజ్ చేసి, భారీ జరిమానా విధిస్తామని తెలిపారు. మగ్దుంపల్లి గ్రామ శివారులో టిప్పర్లు అక్రమంగా మట్టి తరలిస్తుంటే పట్టుకోని పోలీస్‌లకు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు. మునిపల్లి ఎస్సై సురేశ్, ఆర్ఐ రవీందర్, మండల సర్వేయర్ కోటేశ్వర్‌రావు ఉన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి

మహిళలకు వైద్య బృందంతో కలిసి మందులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

బొల్లారం, జూలై 9 : వ్యాధులకు దూరంగా ఉండాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజాబాల్ రెడ్డి సూచించారు. మంగళవారం పోచమ్మ బస్తీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య బృందం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని చైర్పర్సన్ రోజాబాల్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో వైద్య బృందం మహిళలకు పరీక్షలు నిర్వహించగా చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి, కౌన్సిలర్ సంధ్య జైపాల్ రెడ్డి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వర్షాకాలం వ్యాధుల కాలమని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అప్పుడే అంటు రోగాలు దరిచేరవన్నారు. అనంతరం బస్తీలో పర్యటించి అంటువ్యాధులకు కారణమైన విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గుంతల్లో, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమలు ధరిచేరకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య బృందం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, మున్సిపల్ సిబ్బంది సునీత, బస్తీ మహిళలు పాల్గొన్నారు.

శ్రీలంకలో రాజు మ్యాజిక్ షో

రామచంద్రాపురం,జూలై 9 : శ్రీలంకలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాజిక్ ఫెస్టివల్‌లో తెలుగోడు సత్తాచాటాడు. మ్యాజిక్ షోలో అద్భుత ప్రదర్శన కనబర్చడంతో పాటు విదేశీయులకు కొన్ని మ్యాజిక్‌లను కూడా నేర్పించాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంఐజీ ఫేజ్-2 విద్యుత్‌నగర్‌లో నివాసం ఉండే డాక్టర్ బీఎల్ఎన్ రాజు మేజిషియన్. శ్రీలంకలో ఈ నెల 5,6,7 తేదీల్లో జరిగిన ఇంటర్నేషనల్ మ్యాజిక్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు.

శ్రీలంకలో మ్యాజిక్ షో ప్రదర్శన ఇస్తున్న రాజు

గుమ్మడిదల ప్రత్యేక అధికారిగా అఖిలేశ్‌రెడ్డి

గుమ్మడిదల, జూలై 9 : మండల ప్రత్యేకాధికారిగా అఖిలేశ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి చేతుల మీదుగా జిల్లా అధికారుల ఆధేశాల మేరకు అఖిలేశ్‌రెడ్డి మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృ